సమాచారం

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. ఈ సందర్భంగా 'మూవింగ్ ఫ్రమ్ ఫియర్ టు లవ్' అనే అంశంపై ప్రఖ్యాత అంతర్జాతీయ మెడిటేషన్ టీచర్ చైనాకు చెందిన బి.కె.స్వప్న ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించవచ్చు.

3న గురుపౌర్ణమి వేడుకలు

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో గురుపౌర్ణమి ఉత్సవాలను సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు డి రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి గురువారం ఉత్సవాల ఏర్పాట్లను వివరించారు. ఉదయం 5.30 గంటలకు సాయిబాబాకు కాగడ హారతితో ఉత్సవాలు ప్రారంభిస్తారు. 7 గంటల నుంచి 8 గంటల వరకు పంచామృతాభిషేకం, సాయిఅష్టోత్త రాలు, విష్ణుసహస్రనామం, భజన కార్యక్రమాలు, 9 గంటలకు శేజ్ హారతితో ఉత్సవాలు ముగుస్తాయి.

1న శాంతి సరోవర్‌లో సాయినిఖిత అరంగేట్రం

రాయదుర్గం: ఆంధ్రనాట్యం నృత్య ప్రదర్శనతో 16 ఏళ్ల సాయినిఖిత అరంగేట్రం చేయనుంది. గచ్చిబౌలి శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో శనివారం సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ రీజనల్ సెంటర్స్ ఇన్‌చార్జీ రాజయోగి బీకే కుల్‌దీప్, కెమెరామెన్, ఎడిటర్, దర్శకుడు మీర్, ఆయన సతీమణి భువనేశ్వరి, ప్రముఖ నటులు మధుశాలిని, గోకుల్ ఆనంద్ పాల్గొంటారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ఎనిమిది మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు.

క్లుప్తంగా

నేటితరానికి చాకలి ఐలమ్మ స్ఫూర్తిదాయకం

పటాన్‌చెరు: తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని, అదే స్ఫూర్తితో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం పాశమైలారం గ్రామచౌరస్తాలో సర్పంచ్ కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, రజక సంఘం ప్రతినిధులు, ప్రజలతో కలిసి ఎమ్మెల్యే గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహనీయుల పోరాట చరిత్రను నేటి తరాలకు తెలియజేయ చెప్పాలన్న ఉద్దేశంతో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం జరిపిన చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. పటాన్‌చెరులోని సాకి చెరువుకట్టపై చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు పండగ శుభాకాంక్షలు

పటాన్‌చెరు: త్యాగానికి ప్రతీక బక్రీద్ అని, అల్లా ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బక్రీద్ పర్వదినం పురస్కరించుకొని గురువారం ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలో దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు కలిసిమెలిసి జీవించడంతో పాటు అన్ని పండగలు కలిసి చేసుకుంటారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్,ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధు తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్ మరణం తెలంగాణకు తీరని లోటు

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్, తెలంగాణ ఉద్యమ గాయకుడు సాయిచంద్ అకాల మరణం పట్ల ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన గానంతో, ధూమ్ ధామ్ పాటలతో తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించడంతో పాటు, గొప్ప నాయకుడిగా ఎదిగే క్రమంలో మృతి చెందడం కలచివేసిందన్నారు. ఇటీవల పటాన్‌చెరు లో నిర్వహించిన సీఎం కేసీఆర్ సభలో అంతా తానై తన పాటలతో ప్రజలందరినీ చైతన్యపరచడంతో పాటు, ఇక్కడ ఏ కార్యక్రమం నిర్వహించినా హాజరయ్యే వాడని గుర్తు చేసుకున్నారు.

పూడ్చేస్తే ఏమ'నాలా'



అక్రమంగా సెల్లార్ తవ్వకం

- కబ్జాదారుల చేతిలోకి నాలా స్థలం
- సెల్లార్ తవ్వకాల నిషేధంపై బేఖాతర్
- కబ్జాదారులపై చర్యలకు అధికారుల కాలయాపన
- నాలా పూడికతీత ఏది...?

హఫీజ్‌పేట్ : నాలాలో మట్టి నింపి కనుమరుగు చేస్తున్నారు. వరద నీరు పోకుండా చేయడంతో కాలనీలు ముంపునకు గురవ్వడం ఖాయం. శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్‌కు వెళ్లే 100 ఫీట్ల రోడ్డులో చందానగర్ సర్వే నంబర్ 169,170 ప్రభుత్వ స్థలం వద్ద నాలా ఉంది. గంగారం చెరువు నుంచి వచ్చే 20 ఫీట్ల నాలా కైలాస్‌నగర్ ఫేజ్- 2 మీదుగా సంగారెడ్డి జిల్లాలోని పెద్ద నాలాలో కలుస్తుంది. కానీ గంగారం చెరువు నుంచి నాలా ప్రవాహం ఎంత మేర ఉందనే దానిపై ఇప్పటి వరకు ఇరిగేషన్ అధికారులు పరిశీలించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

◆ గంగారం చెరువు నుంచి జవహర్‌నగర్, లింగం కుంట మీదుగా కైలాస్‌నగర్ నుంచి 20 ఫీట్ల నాలా వెళ్తుంది. కానీ కైలాస్‌నగర్ వద్ద రెండు ప్లాట్ల మధ్యలో నుంచి నాలా వెళ్తుంది. నాలా అడ్డు వస్తుందని కొంతమంది అమాంతంగా నాలాను మట్టితో నింపేశారు. ఇక వర్షాకాలంలో సెల్లార్ తవ్వకాలపై నిషేధం ఉన్నా, నాలాను మూసివేయడమే కాకుండా అక్రమంగా సెల్లార్ తవ్వకాలు చేపట్టారు. రాత్రి సమయంలోనే సెల్లార్ తవ్వకాలు చేపడుతున్నారని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు తెలిపారు.

నాలా పూడికతీత ఏది...?

◆ కైలాస్‌నగర్ ఫేజ్ 2 కమాన్ వద్ద నుంచి వెళ్తున్న నాలాలో పిచ్చిమొక్కలు పెరిగిపోయి వరద నీరు సాఫీగా వెళ్ళకుండా అడ్డుపడుతుంది. ఒకవైపు నాలా మూసివేత, మరోవైపు పిచ్చిమొక్కలు పెరగడంతో వర్షాకాలంలో ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

◆ ఒక వైపు నాలా ఆక్రమణ, మరో వైపు అక్రమ సెల్లార్లు, నాలా పూడికతీతలపై ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. నాలా కబ్జాపై, సెల్లార్ తవ్వకాలపై జీహెచ్‌ఎంసీ చందానగర్ సర్కిల్ -21 ఏసీపీ రాజ్‌కుమార్‌ను వివరణ అడగగా సెల్లార్ అనుమతులపై పరిశీలిస్తామని సెలవిస్తున్నారు. నాలా పక్కన బఫర్‌జోన్ ఏర్పాటు చేయడంతో పాటు ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయాలి. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ నాలా కబ్జాపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



నాలాలో మట్టి పోసి పూడ్చుతున్న దృశ్యం

కబ్జాదారుల నుంచి నాలా స్థలంను కాపాడాలి



శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ వెళ్ళే దారిలో కై లాష్‌నగర్ ఫేజ్ 2 వద్ద నాలా ఆక్రమణకు గురవుతుంది. గతంలో నాలా ఎలా ఉండేది ఇప్పుడు ఉన్న పరిస్థితిని ఇరిగేషన్ అధికారులు పరిశీలించి వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.

– కామేశ్వరరావు, చందానగర్

తవ్వకాలపై అధికారులు చర్యలు తీసుకోవాలి



జీహెచ్‌ఎంసీ పరిధిలో వర్షాకాలం సెల్లార్ తవ్వకాలపై నిషేధం విధించింది. కానీ చందానగర్ పరిధిలో ఆ ఆదేశాలు బేఖాతర్ చేసి కొంతమంది అక్రమంగా సెల్లార్ తవ్వకాలు చేస్తున్నారు. వెంటనే వాటిని గుర్తించి తవ్వకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

–అశోక్, చందానగర్



చందానగర్ నుంచి అమీన్‌పూర్‌కు వెళ్ళే 100 ఫీట్ల రోడ్డులో కబ్జా అయిన నాలా



నాలాలో పిచ్చిమొక్కలు పెరిగిన దృశ్యం



సప్తగిరి కాలనీలో.. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా తొలి ఏకాదశి



కేపీహెచ్‌బీకాలనీలో.. స్వామివారి దర్శనానికి క్యూలో భక్తులు



వివేకానందనగర్‌లో.. ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

ఆల్విన్‌కాలనీ: ఆషాఢమాసం..తొలి ఏకాదశి సందర్భంగా గురువారం కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సప్తగిరి కాలనీ, ఆస్‌బెస్టాస్ కాలనీ, పాపిరెడ్డి నగర్, అల్లాపూర్, హైదర్‌నగర్, మూసాపేటలలోని వేంకటేశ్వర స్వామి ఆలయాలు, హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తోరణాలు, విద్యుత్ దీపాలతో ఆలయాలను సుందరంగా అలంకరించారు. ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం నుంచే భక్తులు ఎక్కువ సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలో సుమారు రూ.7.50 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికపూడి గాంధీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

హఫీజ్‌పేట్ డివిజన్‌లో రూ.4.42 కోట్లు....

హుడా కాలనీ, దత్తసాయి ఎన్‌క్లేవ్, ఆర్టీసీ కాలనీ, రామకృష్ణనగర్, మైత్రినగర్ కాలనీలలో రూ.1.69 కోట్లతో సీసీ రోడ్లు, వైశాలినగర్, ఉషోదయ ఎన్‌క్లేవ్, ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీలో రూ.70.70 లక్షలతో సీసీ రోడ్లు, ఓల్డ్ హఫీజ్‌పేట్, ప్రజయ్‌సిటీ, జనప్రియనగర్‌లలో రూ.95 లక్షలతో సీసీ రోడ్లు, ఓల్డ్ హఫీజ్‌పేట్, యూత్ కాలనీ, సాయినగర్ కాలనీలలో రూ.1.7 కోట్లతో సీసీ రోడ్డు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

మాదాపూర్ డివిజన్‌లో రూ.3.15 కోట్లతో..

ఆదిత్యనగర్, సుభాష్‌చంద్రబోస్‌నగర్, భిక్షపతినగర్‌లలో రూ.1.1 కోట్లతో సీసీ రోడ్లు, కాకతీయహిల్స్, సుభాష్‌చంద్రబోస్‌నగర్ కాలనీలలో రూ.49 లక్షలతో సీసీ రోడ్లు, సిద్ధి వినాయకనగర్, ధోబీఘాట్ కాలనీలలో రూ.95 లక్షలతో సీసీ రోడ్లు, గుట్టల బేగంపేట్, అయ్యప్పసొసైటీ కాలనీలలో రూ.69 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జన్మదిన వేడుక.. విరాళం



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణా గ్రాండే గేటెడ్ కమ్యూనిటీ సంక్షేమ సంఘానికి ఓ సీనియర్ సిటిజన్ తన 92వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆరు వీల్ చైర్లు, రెండు స్ట్రెచ్చర్లు, ఒక బ్యాక్‌రెస్ట్ మంచాన్ని విరాళంగా అందించారు. అనంతరం సీనియర్ సిటిజన్లంతా కలిసి ఆయన జన్మదినాన్ని ఘనంగా జరిపారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మంజీరారోడ్డులోని ఒలింపియా జోన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సింధు ధాత్రీనాథ్ గౌడ్ ఆధ్వర్యంలో చిన్నారులకు గురువారం ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి సింధు, ధాత్రీనాథ్ గౌడ్‌లు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంట నగరాల నుంచి మొత్తం 20 టీంలు పాల్గొన్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎర్ర గుడ్ల శ్రీనివాస్ యాదవ్, వినాయకనగర్ కాలనీ ప్రెసిడెంట్ సుభాష్ రావు, న్యాయవాది సురేంద్రనాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్యనగర్‌లోని ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

ఈద్గాలు, మసీదులలో ప్రార్థనలు



న్యూహఫీజ్‌పేట్‌లోని ఈదుల్ అజహా ఈద్గాలో ..

గచ్చిబౌలి/హఫీజ్‌పేట్: త్యాగానికి ప్రతీకగా పేర్కొనే బక్రీద్ పర్వదినాన్ని గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని ఈద్గాలు, మసీదులు కిటకిటలాడాయి. మాదాపూర్‌లోని గుట్టలబేగంపేట్ ఈద్గా, మార్తాండనగర్ ఈద్గా, న్యూహఫీజ్‌పేట్ ఈద్గా, ఆదిత్యనగర్ ఈద్గాలలో వేలాదిమంది పాల్గొన్నారు. బక్రీద్ పర్వదినం గురించి మత పెద్దలు అవగాహన కల్పించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బక్రీద్ పండగ సందర్భంగా రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ ఈద్గాలో గురువారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్, స్థానిక నాయకులు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.



మార్తాండనగర్‌లోని ఈద్గాలో ..

బీటీ రోడ్డు ఏర్పాటుకు మార్కింగ్



మార్కింగ్ పనులను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు

రాయదుర్గం: నానక్‌రాంగూడ ప్రధాన రోడ్డును జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం పరిశీలించారు. నానక్‌రాంగూడలోని ప్రభుత్వ పాఠశాల నుంచి ఎస్‌బీఐ బ్యాంకు వరకు బీటీరోడ్డుగా మార్చాలని తలపెట్టారు. శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఉద్యోగులు చైన్‌మెన్ జావిద్, శ్రీనివాస్‌లు పరిశీలనలో పాల్గొన్నారు. ఈ రోడ్డు గుంతలమయంగా మారడం, ప్రతి ఆదివారం సంత కూడా నిర్వహిస్తుండడంతో ఈ రోడ్డు ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు వెళ్ళేందుకు ప్రధాన రోడ్డు ఇది. ఈ రోడ్డును బీటీరోడ్డుగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నారు.

సర్వ మతాల సారాంశం ఒకటే

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సర్వ మతాల సారాంశం ఒకటేనని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్టియన్ కమ్యూనిటీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రైస్తవుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కుల, మత తేడా లేకుండా అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నియోజకవర్గంలో సొంత నిధులతో ఆలయాలు, మసీదులు, చర్చిల నిర్మాణానికి తనవంతు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేటర్లు వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి, పుష్పనగేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సిగ్నల్ ఏర్పాటు



ట్రాఫిక్ పోలీసు అధికారులతో మాట్లాడుతున్న అధికారులు, కౌన్సిలర్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ నుంచి తెల్లాపూర్‌కు వెళ్లే మార్గంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యను మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి ట్రాఫిక్ పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ట్రాఫిక్ అధికారులు స్పందించి గురువారం స్థానిక కౌన్సిలర్‌లతో కలసి సమస్యను పరిశీలించి సిగ్నల్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ విఠల్‌రెడ్డి, కౌన్సిలర్‌లు లచ్చిరాంనాయక్, బాలాజీ, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బెంగుళూరులో ఇండియా స్టార్టప్ ఫెస్టివల్



టీహబ్ ప్రాంగణంలో ఇండియా స్టార్టప్ ఫెస్టివల్ కర్టన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

హఫీజ్‌పేట్: ఇండియా స్టార్టప్ ఫెస్టివల్–2023 ఈసారి బెంగుళూరులోని ముద్దనహల్లిలో నిర్వహించనున్నారు. వచ్చే ఆగస్టు 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఇండియా స్టార్టప్ ఫౌండేషన్ ప్రకటించింది. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో గురువారం 'ఇన్వెస్టర్ కనెక్ట్' పేరిట వర్క్‌షాప్ నిర్వహించారు.

స్టార్టప్‌లకు చేయూత ఇచ్చేందుకు ఒప్పందం

స్టార్టప్‌లను సృష్టించడానికి టీహబ్ వేదికగా ప్రత్యేక ఒప్పందం నిర్వహించారు. ఇండియా స్టార్టప్ ఫౌండేషన్ సంస్థ టీహబ్ (ఇన్నోవేషన్ పార్టనర్), టై హైదరాబాద్, హైసియా, ఏజీహబ్‌లతో ప్రత్యేకంగా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఐఎస్‌ఎఫ్ సంస్థ ప్రతినిధులు, ఆయా సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి వాటిని మార్చుకున్నారు.ఈ సందర్భంగా ఇండియా స్టార్టప్ ఫెస్టివల్ చైర్మన్, కన్వీనర్ జేఏచౌదరి మాట్లాడుతూ 10వేల కంటే ఎక్కువ స్టార్టప్‌లను ఒక చోట చేర్చి వారి మిషన్‌ను ముందుకు తీసుకెళ్లడానికి, ఆత్మనిర్భర్ భారత్ వైపు నడిపిస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు స్టార్టప్‌ల ప్రతినిధులు, ఐఎస్‌బీ మాజీ డీన్ అజిత్‌రంగ్నేకర్, టీహబ్ సీఈఓ శ్రీనివాసరావుతోపాటు పలు ఐటీ సంస్థలు, ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.